

సుధామ

# దేవుని స్మరింపుము

బస్సు తిరుపతి రోడ్డు మీదుగా దూసు
పోతోంది. ప్రైవేటు సర్వీసే అయినా ప్రయ
ణీకులను కుక్కేయకుండా సీట్లకు సరిపడినం
మందినే తీసుకున్నాడు వాడి పుణ్యమా అ
నారాయణకు మరీ చివరి సీటుగానీ దొరికిం
కాదు. బస్సులో చివరిసీటేగానీ కిటికీ ద
రగా దొరికింది గదా అక్కడికదే సంతృ
ఎలాగో లాగా సరిపెట్టుకోక తప్పదు క
చివరి సీటేమో దాదాపు బస్సులోని జనా
అంతా అక్కణ్ణుంచి కనిపిస్తారు.

నారాయణ జేబులోంచి సిగరేటు తీసి
గించాడు. ఆర్పేసిన అగ్గిపుల్ల కిటికీలో
బయటకు విసిరి నోటినిండా పొగ పీల్చి
లాడు. అప్పుడు కనిపించింది బస్సులో ఎ
రుగ్గా డ్రైవర్ క్యాబిన్‌లో రాసిన పొగ త్రా
రాదు అన్న వాక్యం. చిన్నగా నవ్వుకున్నా
పొగ ఎలాగు తను తాగడు. పీల్చి వది
స్తాడు. తను వదిలేసింది పక్కవాడే క
తాగేది. అంచేత అది వాడికి హెచ్చరికగా
తనకుకాదు. సిగరెట్టు, చుట్ట, బీడి మొద
గునవి కాల్చరాదు అని రాయలేదు కదా వా
అదీ కాక బస్సులోనూ, సినిమాహాల్లోన
కూడా నో స్మోకింగ్ బోర్డు చూసేదాకా సి
రెట్టు కాల్చాలన్న గుర్తే రాదాయె కొందరి

నారాయణకు ప్రైవేటు బస్సు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అంచేత ఇంకేం సూక్తి రత్నాకరాలున్నాయా అని పరికించాడు. 'తల వంచుము' అని వుంది ఓ దగ్గర. భారతదేశపు బస్సులు బానిసతాన్ని కాక మరేం ప్రబోధిస్తాయిలే అనుకుని అలా అనుకోవడం దేశప్రేమ కాదేమోలే అని మనసులోనే లెంపలేసుకుని వినయ విధేయతలను నేర్పుతోందిలే అనుకున్నాడు మళ్ళీ. 'చేతులు బైటికి చాపరాదు' అని మరో రచన. నారాయణకు ఓ కథ గుర్తొచ్చింది. ఓ బస్సులో ప్రయాణికుడికీ కండెక్టరుకీ మధ్య ఈ విషయంలోనే పెద్ద రభసయిపోయిందట. చేతులు లోపలపెట్టుకోమంటాడట కండెక్టరు. అతగాడేమో బయటకు చాపిన చెయ్యి ముడవనైన ముడవడట. లైటు స్తంభాలు తగులుతాయని హెచ్చరించాడట-ఉహూ...., డ్రైవరుకు వెనుకగా వచ్చేవి అద్దంలో కనబడవని నచ్చజెప్పాడట-ఉహూ. ఏవరైనా అమ్మాయిని చూచి పిలుస్తున్నావనుకుని అల్లరి చేస్తారని బెదిరించాట్ట - వింటేనా...., ప్రక్కగా ఏ లారీయో వస్తే చెయ్యి తెగిపోగలదని భయపెట్టాడట. ఇలా ఎన్నివిధాల చెప్పినా అతగాడు తీయడటే! పైగా గంయ్యిమని లేచి "మహా మహా భారతదేశమే అప్పులకోసం పై దేశాలకు బయటకు చేతులు చాస్తుంటే నువ్వెవడివయ్యా? నన్ను చేతులు బైటికి చాపరాదనటానికి" అని కసురుకుని చివరికి "నా చంకలో కురుపేసింది. ఏం చేయమంటావ్" అన్నాడట. నారాయణ నవ్వుకున్నాడు.

"టిక్కెట్టుకు సరిపడు చిల్లర ఇవ్వవలెను" అని ఇంకో రాత. ఇదొకటి. లేకపోతే చిల్లర లేదని కండెక్టర్ ఎగవేసే ప్రమాదం లేకపోలేదు మరి.

"దేవుని స్మరింపుము" నారాయణ కళ్లు ఈసారి ఈ రాతమీద నిలిచాయి. బహుశా బస్సు ఓనర్‌కు డ్రైవర్ డ్రైవింగ్ మీద నమ్మకంలేక ఎందుకేనా మంచిదని ప్రయాణీకులకు ఈ సూచన చేస్తున్నాడు కాబోలు. శుభ్రంగా జీవితభీమా చేయించండి అని రాయించి ఎల్లయిసి ప్రకటన అనేపేర కంపెనీ వాడి దగ్గర్నుంచి అడ్వర్టైజ్‌మెంట్ రేట్ పదో పరకో పుచ్చుకుంటేపోలే! బహుశా తిరుపతి ట్రిప్పుల బస్సు కదా అని ఇలా రాశాడేమోలే. అయినా వీడెవడు ఇది చెప్పడానికి. బస్సులో ఎక్కేవాళ్లంతా ఆస్తికులే కావాలని రూలేం వుంది. పైగా హరేరామ హరేరామ రామరామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అనికూడా నింపేశాడు.

బస్సు సాహిత్యం అంతా చదివిన నారాయణ వీటి ప్రభావం ప్రయాణీకుల మీద ఏమయినా వుందా అని చూపుల రీసెర్చి ప్రారంభించాడీమాటు. ఏ వొక్కటయినా ఎవరయినా పాటిస్తున్నారా? సగానికి సగం 'పొగ త్రాగరాదు'ను పట్టించుకోకుండా ధూమపానం చేస్తూనే వున్నాను. నిద్ర మత్తులో తూలుతున్న వాళ్ళు తప్ప 'తల వంచుము' సూత్రం పాటించడం లేదు. సిగరెట్టు నుసి విదల్చడానికి కిటికీలదగ్గర కూర్చున్న వాళ్ళో, పిల్లలో చేతులు బయటికిచాపుతూనేవున్నారు. సరే ఇక చిల్లర విషయంలో మునుపే కండెక్టర్‌కూ కొందరు ప్రయాణీకులకీ గొడవ అవనే అయింది. ఇకపోతే 'దేవుని స్మరింపుము' ఎవడు చూడొచ్చాడు. మనసులో ఎవడేం స్మరిస్తున్నాడో! బస్సుకన్నా వేగంగా ఎవడి మనస్సు యెటు పరుగెడుతోందో ఎలా తెలుస్తుంది.

నారాయణ చెవులో హరేరామ హరేరామ రామరామ హరేహరే అన్న నామ స్మరణ వినిపించింది. "ఎవరబ్బా దేవుని స్మరింపుము అన్న మాటను అక్షరాలా పాటిస్తున్నవాడు"

అని ముందుకు పరికించాడు. మూడు సీట్ల ముందర యెడంవైపు సీట్లో కూచున్న ఒకా యన హరేరామ హరేరామ హరేకృష్ణ హరే కృష్ణ అని అక్షరాలు అచ్చేసిన కాషాయపు శాలువా కప్పుకుని కాస్త గట్టిగా అదే నామ స్మరణ చేస్తున్నాడు ఆపకుండా. హరే రామ హరేరామ రామరామ హరేహరే హరే కృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అం టున్న ఆయన అర్ధ నిమీలిత నేత్రాలతో పారవశ్యంలో వున్నట్టే కనిపించాడు.

ఫరవాలేదే! దేవుని స్మరింపమన్న మాటను అక్షరాలా అమలుచేస్తున్నాడీ యన. నిజమేలే తిరుపతికి వెడుతూ దైవ స్మరణ చేయకపోవడం ఏం పద్ధతి. నారాయణ కూడా భగవద్ధ్యానం చేద్దామనుకున్నాడు. ఇస్త్రీలో చుట్టూతా రాసివున్న హరేరామ హరేరామ రామరామ హరేహరే... అంటూ చదవటం మొదలెట్టాడు. కానీ అలా చదు వుతూ పోతుంటే మధ్యలో పొగ త్రాగుడు కృష్ణకృష్ణ హరేహరే అని తలవంచుకు రామరామ హరేహరే అని చదవాల్సి వచ్చి స్మరణలోని సీరియస్‌నెస్ చచ్చిపోతుంటోంది. నారాయణకు అలా చదివితే నచ్చినట్లు లేదు. పైగా అపరాధ భావన వొకటి: దేవుడిని యెగతాళి చేసినట్టవుతుందే మోనని.

నారాయణ ప్రక్కన కూచున్నతను వున్నట్టుండి అడిగాడు "దైవదర్శనం సులభంగా అవుతుందాండీ" అని.

"అయ్యా అది మీ అదృష్టం మీద ఆధారపడి వుంటుంది. వూరుకొద్దీ శ్రమ అన్నారు కదా" అన్నాడు నారాయణ.

"నిజమేననుకోండి కానీ దర్శనభాగ్యం కలగాలంటే తెలిసినవాళ్లెవరయినా వుండా లంటారా."

"అలా అనుకునేట్టయితే అదిగో ఆ ముందర హరేరామ హరేరామ అంటూ అక్షరాలు అచ్చున్న శాలువా చుట్టుకుని దేవుని స్మరణ చేస్తున్నాడు చూడండి అలాంటి భక్తుల్ని పట్టండి. కనీసం వాళ్ళ పుణ్యంతోనైనా మీకు అదృష్టం కలిసిరావచ్చు."

"నిరంతర నామస్మరణం చేసే భాగ్యం అందరికీ వుంటుందటండీ ఆయనలా" అడి గాడతను తన్మయపడి.

"ఆయనలా బయటకు అందరూ స్మరిస్తే తప్ప అవల్లా యెవరు మనసులో ఏం స్మరిస్తున్నారో ఏం తెలుస్తుంది చెప్పండి."



ఈ జ్యోతిశ్చక్రము నిగ్గులు
ఎగిరే నా ఊహల మొగ్గలు

ఫొటో: ఎస్. శివన్నారాయణ

"మనసులో స్మరణ చేసుకున్నా మంచిదే లెండి భగవంతుడిని."

"అబ్బే ఆయనలా బయటకు స్మరించాలని నేననడం లేదు. కానీ ఆయనకున్న భక్తి ఏకాగ్రత.... నిరంతర ధ్యానం మొదలైన వాటికి ఈ స్మరణ...."

నారాయణ మాట్లాడుతుండగా బస్సుకు మలుపు వచ్చింది. ఎదురుగ్గా ఓ లారీని తప్పించి ప్రక్కనుంచి పోవడంలో ఓ ఎద్దుబండికి గుద్దబోయి డ్రైవర్ సడన్‌బ్రేకు వేశాడు. దాంతో అందరూ ముందుకు తూలిపడ్డారు. ప్రమాదమేమో అని గుండెలు దడదడ లాడాయి. అందరూ అప్రయత్నంగానే "ఏడు కొండలవాడా వెంకటరమణా గోవిందా గోవింద ఆపదమ్రొక్కులవాడా అనాధరక్షకా పాహిమా పాహిమాం" అంటూ ఏక కంఠంతో అరిచారు. నారాయణ నోటినుండి కూడా 'శ్రీనివాసా శ్రీనివాసా' అన్న పిలుపు బయటికొచ్చింది.

కానీ ఈ సామూహిక స్మరణకుభిన్నంగా "అమ్మో....చచ్చాన్రా బాబూ! ఏం దైవరు వయ్యా నిన్ను తగలెయ్యా! మాడు పగిలి పోయింది కదయ్యా....కొంచెం వుంటే కిటికీ కడ్డీ తగిలి కన్ను పోను!....నీ నడపడం మండినట్టే వుంది.... అమ్మ....నీ....యమ్మ ఏం మలుపు. ఆ లారీ ముండాకొడుక్కేం పోయింది. తెగులు....జనం వున్న బస్సుకదా వాడి స్పీడు తగ్గిస్తే....ఏం పోయింది. వాడి సిగ్గోసిరి....వెధవముండా కొడుకు .... ఈ డ్రైవర్ చచ్చినోడు మాత్రం....సడన్‌బ్రేక్ వేయడం ఇలానేనా. వీడి దుంపతెగ...." అంటూ ఏకధారగా అందుకున్నాడు దైవ నామ స్మరణాక్షరాలు రాసున్న శాలువా కప్పు కుని అంతవరకూ బిగ్గరగా హరేరామ..జపి స్తున్న ఆయన. □